## జేఈఈ, నీట్, సీయూఈటీ పరీక్షలు యథాతథం

న్యూఢిల్లీ, మార్చి 17: ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జేఈఈ మెయిన్, నీట్ యూజీ పరీక్షలు వాయిదా పడే అవకాశం ఉందన్న ఊహాగానాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం కొట్టిపడేసింది. పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్ సెషన్ 2 పరీక్షలు ఏప్రిల్ 1-15 మధ్య జరుగుతాయని గతంలో ప్రకటించగా, ఇటీవల మరో ప్రకటన చేస్తూ ఏప్రిల్ 4-15 మధ్య జరుగుతాయంటూ రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. నీట్ యూజీ పరీక్షలు మే 5న జరగాల్సి ఉండగా, ముందుగా పేర్కొన్నట్టుగానే అప్లికేషన్ కరెక్షన్ విండో మార్చి 18 నుంచి మొదలవుతుంది. సీయూఈటీ యూజీ పరీక్షలు మే 15- 31 వరకు జరగాల్సి ఉండగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాక సీయూఈటీ షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకుంటామని తొలుత చెప్పినప్పటికీ, ఈ షెడ్యూల్‌లోనూ ఎలాంటి మార్పు లేదని యూజీసీ చీఫ్ జగదీశ్‌కుమార్ తెలిపారు.

## నీరే నిజమైన సంపద

### ఏసీ నీటి పొదుపు పాఠం చెప్పిన మహీంద్రా

బెంగళూరు : బెంగళూరు నగరంలో నీటి సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా నీటి పొదుపు గురించి ఎక్స్‌లో షేర్ చేసిన వీడియో వైరల్ అవుతున్నది. ఏసీ కండెన్సర్‌కు ఓ సన్నని పైపు బిగించి ఆ నీటిని ఓ పెద్ద పైపులోకి పంపి దాని చివర నల్లాను అటాచ్ చేస్తే ఏసీ నుంచి వృథాగా వచ్చే నీరు పెద్ద పైపులో నిల్వ అవుతుందని మహీంద్రా తెలిపారు. ఈ నీటిని వాహనాలను కడగడానికి, మొక్కల కోసం ఉపయోగించవచ్చునని తెలిపారు. ''నీరే సంపద'' అని, దేశవ్యాప్తంగా ఇటువంటి పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు.

## మహదేవ్ యాప్ కేసులో నిందితుడిగా బఘేల్

న్యూఢిల్లీ, మార్చి 17: మహదేవ్ యాప్ కుంభకోణానికి సంబంధించి ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూపేశ్ బఘేల్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్నది. ఈడీ ఫిర్యాదు ఆధారంగా ఆ రాష్ట్ర ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) బఘేల్‌ను నిందితుడిగా పేర్కొంటూ కేసు నమోదు చేసింది. దీనిపై బఘేల్ స్పందిస్తూ, బీజేపీ రాజకీయ కుట్రలో భాగంగా కేసు పెట్టారని, అక్రమ నగదు లావాదేవీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## నమాజ్ చేస్తున్న విదేశీ విద్యార్థులపై దాడి

అహ్మదాబాద్: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీలోని హాస్టల్‌లో నమాజ్ చేస్తున్న విదేశీ విద్యార్థులపై కొందరు దాడి చేశారు. ఇందులో శ్రీలంక, తజకిస్థాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. 75 మంది విదేశీ విద్యార్థులు ఎ బ్లాక్ హాస్టల్‌లో ఉన్నారు. శనివారం రాత్రి కొందరు నమాజ్ చేస్తుండగా ఈ దాడి జరిగింది. మసీదులో నమాజ్ చేసుకోవాలని దుండగులు విద్యార్థులను హెచ్చరించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

## ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా హోసబళె

న్యూఢిల్లీ, మార్చి 17: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) ప్రధాన కార్యదర్శిగా కర్ణాటకకు చెందిన దత్తాత్రేయ హోసబళె తిరిగి ఎన్నికయ్యారు. అఖిల భారతీయ ప్రతినిధి సభ(ఏబీపీఎస్) సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. దీంతో హోసబళె 2027 వరకు మరో మూడేండ్ల పాటు ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఏబీపీఎస్ సమావేశాలకు ఆరెస్సెస్ అనుబంధ సంఘాలకు చెందిన 1,500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## మళ్లీ రష్యా అధ్యక్షుడిగా పుతినే?!

### ముగిసిన ఎన్నికలు

మాస్కో: రష్యా అధ్యక్ష ఎన్నికలు ఆదివారంతో ముగిశాయి. ఈ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌నే తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అలెక్సీ నావల్నీ గత నెలలో అంటార్కిటికా జైలులో మరణించడంతో 71 ఏండ్ల పుతిన్‌కు దాదాపుగా ఎన్నికల్లో ఎదురు లేకుండా పోయింది. మరో పక్క ఉక్రెయిన్ ఆదివారం పెద్దయెత్తున డ్రోన్లతో మాస్కో సహా మూడు రీజియన్లపై దాడి జరిపింది.

# ధరలు.. బాండ్లపైనే చర్చ

## ప్రతిపక్షాలకు ప్రచారాస్త్రాలుగా మారిన ప్రధాన సమస్యలు

భావోద్వేగ అంశాలను సొమ్ము చేసుకొనేందుకు బీజేపీ యత్నం!

లోక్‌సభ ఎన్నికలపై ధరలు, రైతుల కష్టాలు, నిరుద్యోగం ప్రభావం





న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాజకీయ పార్టీలు హామీలు, గ్యారెంటీలతో హోరెత్తించనున్నాయి. అయితే ఓటర్లు మాత్రం దేశంలోని ప్రధాన సమస్యలు, ఆయా అంశాలపై పార్టీల వైఖరిని నిశితంగా గమనిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎన్నికలపై ప్రభావం చూపే ప్రధాన అంశాలు, సమస్యలేమిటో పరిశీలిద్దాం.

**ప్రజా సమస్యలు**

దేశంలో ప్రధాన సమస్యలు నిరుద్యోగం, ధరల పెరుగుదల. ఈ దేశంలో ఉద్యోగాలు లేకపోవడం అతి పెద్ద సమస్య అని విపక్ష ఇండియా కూటమి ఆరోపిస్తున్నది. కానీ మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నదని, ఉద్యోగాలు పెరుగుతున్నాయని అధికార బీజేపీ చెప్తున్నది.

**ఎన్నికల బాండ్లు**

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతమయ్యాయి. బీజేపీకి అత్యధికంగా దాదాపు రూ.7,000 కోట్లు విరాళాలు వచ్చాయని వెల్లడైంది. ఈ బాండ్ల ద్వారా అవినీతి జరిగిందని, బీజేపీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారం సరిగ్గా ఎన్నికల ముందు రావడంతో ప్రతిపక్షాల చేతికి ఓ అస్త్రం లభించినట్లైంది.

**రైతుల సమస్యలు**

ఎన్నికల్లో రైతు సంఘాల ఆందోళనలు బీజేపీకి తలనొప్పిగా మారవచ్చు. మోదీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాము అధికారం చేపడితే, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించే చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇస్తున్నాయి. అయితే పీఎం-కిసాన్ పథకం వల్ల రైతుల జీవితాలు మారాయని బీజేపీ ఊదరగొడుతున్నది. రైతు సంఘాల నేతలతో చర్చలు జరుపుతూ, వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

**సుపరిపాలన!**

మోదీ ప్రభుత్వం సుపరిపాలనను అందించిందని, అభివృద్ధి వేగాన్ని పెంచిందని, భవిష్యత్తు కోసం దార్శనికతతో చర్యలు చేపడుతున్నదని బీజేపీ చెప్పుకుంటుండగా; ఈ పదేళ్ల పాలనా కాలంలో అనేక అన్యాయాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవస్థల కబ్జా, రాజ్యాంగంపై దాడి, ఆర్థిక అసమానతల పెరుగుదల వంటివాటిని ఉదాహరణలుగా చూపిస్తున్నది.

**సీఏఏ, అధికరణ 370 రద్దు**

ఈ రెండిటిని తమ ఘనతగా బీజేపీ చెప్పుకుంటుండగా, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు వీటిని వ్యతిరేకిస్తున్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొచ్చింది. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని బీజేపీ సంకేతాలు పంపించింది. తాము ఎన్నికల ప్రణాళికలో చెప్పినదే చేస్తామని మోదీ ప్రభుత్వం గట్టిగా చెప్తున్నది. అయితే ఈ చర్యలన్నీ ఐకమత్యాన్ని దెబ్బతీసేవేనని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి.

**అయోధ్య రామాలయం**

జనవరి 22న అయోధ్య రామాలయంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనతను బీజేపీ తన ఖాతాలో వేసుకుంటున్నది. ప్రధాని మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 500 సంవత్సరాల కలను మోదీ సాకారం చేశారని బీజేపీ ప్రచారం చేసుకుంటున్నది. కాంగ్రెస్, పలు ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి.

**మోదీ ఆకర్షణ**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు ప్రధాన మంత్రి మోదీ ప్రధాన ఆకర్షణగా కనిపిస్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టి, తనకు అనుకూలంగా మార్చుకొనేందుకు ఈసారి లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన విమర్శను మోదీ ఉపయోగించుకుంటున్నారు. మోదీకి కుటుంబం లేదని లాలూ వ్యాఖ్యానించడంతో, 'మోదీ కుటుంబం' అనే నినాదాన్ని మోదీ అందుకున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు తాము 'మోదీ కుటుంబం' అని సామాజిక మాధ్యమాల్లో చెప్పుకుంటున్నారు. మోదీ కూడా బహిరంగ సభల్లో మాట్లాడుతూ, ఈ దేశంలోని ప్రతి ఒక్కరూ తన కుటుంబ సభ్యులేనని చెప్తున్నారు.

**కాంగ్రెస్ న్యాయ హామీలు**

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తుండగా, ఆ పార్టీ 5 న్యాయ గ్యారంటీలను ప్రకటించింది. యువత, రైతులు, కార్మికులు, మహిళలకు న్యాయం చేస్తామని, భాగస్వామ్య న్యాయాన్ని అందజేస్తామని చెప్పింది.

**సనాతన ధర్మం**

ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల భావజాలాలు ఈ ఎన్నికల్లో చర్చకు వస్తున్నాయి. ఇండియా కూటమిలోని కొన్ని పార్టీల నేతలు సనాతన ధర్మంపై తీవ్ర ఆరోపణలు చేస్తుండగా, సనాతన ధర్మానికి మద్దతుగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. వేర్వేరు సిద్ధాంతాలు గల బీజేపీ, కాంగ్రెస్ తమ భావజాలాలను ఈసారి ఎన్నికల్లో ప్రజల ముందు ఉంచుతాయి.



## ఎన్నికల బాండ్ల అదనపు వివరాలు వెల్లడి

- 2019 ఏప్రిల్ 12 కన్నా ముందు సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచిన కేంద్ర ఎన్నికల సంఘం
- బీజేపీకి దాదాపు 7 వేల కోట్ల విరాళాలు

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఆదివారం మరికొన్ని ఎలక్టోరల్ బాండ్ల సమాచారాన్ని వెల్లడించింది. ఈ బాండ్లు 2019 ఏప్రిల్ 12 కన్నా ముందు నాటివని తెలిపింది. ఈ తేదీ తర్వాత కొనుగోలు చేసిన బాండ్ల వివరాలను గత వారం ప్రకటించింది. తాజా ప్రకటన తెలిపిన వివరాల ప్రకారం, 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు తమకు వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల సమాచారాన్ని అప్పట్లో సీల్డ్ కవర్‌లో ఈసీకి సమర్పించాయి. ఈ కవర్లను తెరవకుండానే, యథాతథంగా సుప్రీంకోర్టుకు ఈసీ సమర్పించింది. వీటి కాపీలను తన వద్ద ఉంచుకోలేదు. ఈ నెల 15న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ సీల్డ్ కవర్లను తిరిగి సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఈసీకి అందజేసింది. ఈ సమాచారాన్ని ఈసీ తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది.

## ఇన్‌స్టాగ్రామ్‌లో హానికర కంటెంట్!

న్యూయార్క్, మార్చి 17: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లను నిర్వహిస్తున్న మెటా సంస్థపై లొట్టె రుబీక్ అనే సైకాలజిస్ట్ సంచలన ఆరోపణలు చేశారు. మెటా సంస్థ యూజర్ల శ్రేయస్సు కంటే ఆదాయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదని ఆమె ఆరోపించారు. గత మూడేండ్లుగా మెటా సంస్థ నిపుణుల బృందంలో పని చేసిన లొట్టె రుబీక్.. ఆత్మహత్యల నివారణ, హానికర కంటెంట్‌పై సలహాదారుగా వ్యవహరించారు. అయితే, ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న హానికర కంటెంట్‌ను తొలగించాలని తాను చేసిన సూచనను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆమె తన పదవికి రాజీనామా చేశారు. యువతులు, ఆడపిల్లలపై ప్రభావం చూపుతున్న, ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న కంటెంట్‌పై మెటా సంస్థ ఉదాసీనతతో వ్యవహరిస్తున్నదని ఆమె ఆరోపించారు. మరోవైపు మెటా ప్లాట్‌ఫార్మ్‌లలో అక్రమంగా మాదకద్రవ్యాల అమ్మకాలు జరుగుతున్నాయని అమెరికా దర్యాప్తు సంస్థలు మెటాపై విచారణ ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఒక కథనం ప్రచురితమైంది.

**లావానలం.. భీతావహం**



చూడగానే అబ్బురపరుస్తున్న ఈ దృశ్యం ఒక అగ్నిపర్వత విస్ఫోటనానిది. పశ్చిమ ఐలాండ్‌లోని గ్రిండవిక్ పట్టణ శివార్లలో అగ్నిపర్వతం బద్దలై ఇలా నిప్పులు చిమ్ముతున్నది. అగ్నిపర్వతం నుంచి ఎర్రటి లావా పొగలు కక్కుతూ ప్రవహిస్తున్నది. ఐలాండిక్ కోస్ట్ గార్డ్ సిబ్బంది ఈ చిత్రాన్ని కెమెరాలో బంధించారు.

## ఎన్నికల నోటిఫికేషన్ కోసం రాష్ట్రపతికి సిఫారసు

న్యూఢిల్లీ, మార్చి 17: ఏడు దశల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ చేయాల్సిందిగా కేంద్ర క్యాబినెట్ ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 14(2) ప్రకారం లోక్‌సభ ఎన్నికల తేదీలకు నోటిఫికేషన్ జారీ చేయడం కోసం ఇప్పటికే కేంద్ర న్యాయశాఖకు ఎన్నికల కమిషన్ సిఫారసు చేసింది. ఈ మేరకు ఆదివారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం.. ఎన్నికల తేదీలను రాష్ట్రపతికి పంపి, ఇందుకు అనుగుణంగా నోటిఫికేషన్లు జారీ చేయాల్సిందిగా సిఫారసు చేసింది. రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్లతో కూడిన గెజిట్ రానుంది. కాగా, ఏడు దశల లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19వ తేదీన మొదటి దశతో ప్రారంభం కానున్నాయి.

## 2 రాష్ట్రాల్లో రెండు రోజుల ముందే కౌంటింగ్

### అరుణాచల్, సిక్కింలపై ఈసీ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 17: ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభ ఎన్నికలతో పాటే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను జూన్ 4వ తేదీనే నిర్వహించనున్నట్టు ఈసీ శనివారం ప్రకటించింది. అయితే, ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీల గడువు జూన్ 2వ తేదీకే ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను జూన్ 2వ తేదీనే జరపనున్నట్టు ఈసీ ఆదివారం ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ మాత్రం ముందుగా ప్రకటించినట్టుగానే దేశమంతా జూన్ 4వ తేదీనే జరగనున్నట్టు తెలిపింది.

## అమెరికాలో ఏపీ విద్యార్థి హత్య

### కారులో మృతదేహం గుర్తింపు



న్యూఢిల్లీ, మార్చి 17: తెలుగు విద్యార్థి ఒకరు అమెరికాలో దారుణ హత్యకు గురయ్యాడు. ఏపీలోని గుంటూరు జిల్లా బుర్రిపాలెంకు చెందిన 20 ఏండ్ల పరుచూరి అభిజిత్‌ను దుండగులు దారుణంగా హత్య చేసి అతని మృతదేహాన్ని కారులో ఉంచి అడవి సమీపంలో వదిలేశారు. గత ఏడాదే బోస్టన్ యూనివర్సిటీలో చేరిన అభిజిత్ తన క్లాస్‌మేట్లతో కలిసి ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. యథాప్రకారం వారితో యూనివర్సిటీకి వెళ్లిన అభిజిత్ తిరిగి రాకపోడంతో అతని రూమ్‌మేట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఒక అడవి సమీపంలో వదిలేసిన కారులో అతని మృతదేహాన్ని కనుగొన్నారు. హత్యకు గల కారణం వెల్లడి కాలేదు. అభిజిత్ దగ్గర ఉన్న డబ్బు, ల్యాప్‌టాప్ కోసం దుండగులు హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. అతని మరణం గురించి తెలిసి బంధువులు తీవ్రంగా రోదిస్తున్నారు. అతని మృతదేహాన్ని భారత్‌కు పంపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## 'నేను గెలవకపోతే రక్తపాతమే!'



న్యూయార్క్, మార్చి 17: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను గెలిపించకపోతే రక్తపాతమే అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వలసదారులపై కూడా ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శనివారం ఓహియోలో ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతూ... 'మెక్సికోలో కార్లను తయారుచేసి అమెరికన్లకు విక్రయించాలని చైనా భావిస్తున్నది. ఎన్నికల్లో నేను గెలిస్తే ఆ కార్లను అమెరికాలో అమ్మనివ్వను. ఒకవేళ నేను గెలవకపోతే అది దేశానికి రక్తపాతం అవుతుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రచార బృందం తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికన్ ప్రజలు మాత్రం మరోసారి ఆయనను ఎన్నికల్లో ఓడించాలని అనుకుంటున్నారని బైడెన్ బృందం పేర్కొన్నది.

## కేజ్రీవాల్‌కు రెండు కేసుల్లో ఈడీ సమన్లు



ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేజ్రీవాల్, ఆప్ నేత అతిశీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిలు మంజూరైన సంతోషం కాసేపైనా లేకుండా పోయింది. ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండు వేర్వేరు కేసుల్లో సమన్లను జారీ చేసింది. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ, రాజకీయ ప్రత్యర్థులను అంతం చేయడానికి ఈడీ, సీబీఐలను తన గూండాలుగా బీజేపీ ఉపయోగించుకుంటున్నదని ఆరోపించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తొమ్మిదోసారి, ఢిల్లీ జల మండలి (డీజేబీ) కేసులో తొలి సారి కేజ్రీవాల్‌కు ఈడీ ఆదివారం సమన్లు జారీ చేసింది. డీజేబీ కేసులో ఈ నెల 18న, మద్యం పాలసీ కేసులో ఈ నెల 21న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

**అది బూటకపు కేసు: ఆప్**

ఈడీ సమన్లపై ఢిల్లీ రాష్ట్ర మంత్రి, ఆప్ నేత అతిశీ ఆదివారం విలేకర్ల సమావేశంలో ఘాటుగా స్పందించారు. ఢిల్లీ జల మండలికి సంబంధించిన బూటకపు కేసులో కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లను జారీ చేసిందని మండిపడ్డారు. ఈ కేసు గురించి ఎవరికీ తెలియదన్నారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా నిలువరించడం కోసం ఏదో ఓ విధంగా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలనే ఉద్దేశంతో రచించిన ప్రణాళికగా ఇది కనిపిస్తున్నదని ఆరోపించారు. ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికల్లో పోరాడకుండా కేజ్రీవాల్‌ను ఆపడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ఉద్దేశమనే విషయం స్పష్టమవుతున్నదన్నారు. న్యాయస్థానాలు, ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థలను మోదీ, బీజేపీ పట్టించుకోవడం లేదని, కేవలం ఎన్నికల గురించి, వాటిలో పాల్గొనకుండా ప్రతిపక్షాలను కట్టడి చేయడం గురించి మాత్రమే ఆసక్తి కనబరుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులను అంతం చేయడానికి ఈడీ, సీబీఐలను తన గూండాలుగా బీజేపీ వాడుకుంటున్నదన్నారు.

## ఈడీకి మరిన్ని అధికారాలు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని విచ్చలవిడిగా వినియోగిస్తూ ప్రత్యర్థి నేతలను వేధింపులకు గురిచేస్తున్నదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు గత కొంతకాలంగా విమర్శిస్తున్నాయి. అయితే, దీన్ని పట్టించుకోని కేంద్రం.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ-2002)కు గత మేలో సవరణలను చేయడం తద్వారా ఈడీకి విస్తృత అధికారాలను కట్టబెట్టడం చర్చనీయాంశం మారింది. ఈ ప్రక్రియను సుప్రీంకోర్టు కూడా సమర్థించడం పట్ల విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. పీఎంఎల్‌ఏకు ఆర్థిక చట్టాల మాదిరిగా సవరణలు చేయడం రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందో కాదో సుప్రీంకోర్టు పునఃపరిశీలించాలని ఆయా పార్టీలు కోరుతున్నాయి. ఆస్తులు జప్తు చేసేందుకు ట్రిబ్యునల్ నుంచి అనుమతి తీసుకోవాలన్న క్లాజును పీఎంఎల్‌ఏ నుంచి తొలగించారని, విపక్ష పార్టీల నేతలను వేధించడానికే కేంద్రం చట్టంలో ఈ విధంగా ఏకపక్ష సవరణలు చేసిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

## ఫీడ్‌బ్యాక్ పేరుతో రాజకీయ ప్రచారమా?

### 'వికసిత్ భారత్' సందేశాలపై విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ, మార్చి 17: వాట్సప్‌లో 'వికసిత్ భారత్ సంపర్క్' పేరుతో ప్రజలకు వస్తున్న ఓ సందేశంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రచారానికి పాల్పడుతుందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రజలకు వస్తున్న ఆ సందేశంలో ప్రధాని మోదీ పంపినట్టుగా ఒక లేఖను అటాచ్ చేశారు. అదేవిధంగా గత పదేండ్లలో దేశంలోని కోట్లాది కుటుంబాలు కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాయని, వికసిత్ భారత్ ఆకాంక్షలను నెరవేర్చేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని, ఆలోచనలను పంచుకోవాలని ఆ సందేశం కోరింది. అయితే ఈ సందేశంపై కాంగ్రెస్ కేరళ యూనిట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాబోయే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఒక భాగమని, ప్రభుత్వాన్ని అందులో భాగం చేస్తున్నారని, ప్రభుత్వం ప్రజల డాటాను దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపించింది. ఫీడ్‌బ్యాక్ ముసుగులో అందులో అటాచ్ చేసిన పీడీఎఫ్ ఫైల్ ఒక రాజకీయ ప్రచారంతో కూడినదని కేరళ కాంగ్రెస్ మెటా సంస్థను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో శనివారం సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వికసిత్ భారత్ పేరుతో సందేశాలు వస్తున్నాయని టీఎంసీ నేత మహువా మొయిత్రా ఆక్షేపించారు.

## ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్‌కు షాక్

### పార్టీకి మాజీ మంత్రి హరక్ సింగ్ కోడలు గుడ్‌బై

డెహ్రాడూన్, మార్చి 17: ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగలింది. మాజీ మంత్రి హరక్ సింగ్ రావత్ కోడలు అనుకృతి గుసైన్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వ్యక్తిగత కారణాలతో తాను పార్టీని వీడుతున్నట్టు ఆమె ప్రకటించారు. ఆమె బీజేపీతో చేరుతారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. కాగా, కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పని చేసిన హరక్ సింగ్ ఆస్తులపై ఇటీవల ఈడీ సోదాలు నిర్వహించింది



## 'శుక్రవారం వద్దు.. మార్చండి'

కోజికోడ్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీలపై ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈసీ షెడ్యూల్ ప్రకారం తమిళనాడులో ఏప్రిల్ 19న, కేరళలో ఏప్రిల్ 26న ఎన్నికలు జరుగుతాయని, వాస్తవానికి ఆ రెండు రోజులూ శుక్రవారమని ఐయూఎంఎల్ తెలిపింది. శుక్రవారం ముస్లింలకు ఎంతో పవిత్రమైన దినమని, వారు మసీదులకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించాల్సి ఉన్నందున అటు అభ్యర్థులు, అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలకు కూడా ఇబ్బంది వస్తుందని తెలిపింది. దీనిపై తాము త్వరలోనే ఈసీని ఆశ్రయించి పోలింగ్ తేదీలను మార్చాలని విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపింది.




## 'మోదీ చిత్రాలను వెంటనే తొలగించాలి'

పుణె, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రకటన వెలువడి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత కూడా ప్రధాని మోదీకి చెందిన చిత్రాలు పలు బహిరంగ ప్రదేశాల్లో కనిపించడంపై మహారాష్ట్రలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ పుణెకు చెందిన న్యాయవాది అసీమ్ సరోద్, పర్యావరణవేత్త, విశ్వంభర్ చౌదరి ఎన్నికల సంఘానికి శనివారం లీగల్ నోటీసులు పంపారు. మహారాష్ట్రలోని పలు బహిరంగ ప్రదేశాల్లో పీఎం మోదీ, మహారాష్ట్ర ఇద్దరు డిప్యూటీ సీఎంల చిత్రపటాలు దర్శనమిస్తున్నాయని, ఈసీ జోక్యం చేసుకోవాలన్నారు.



## 'బాండ్ల పేరుతో వైట్ కాలర్ అవినీతి'

ముంబై, మార్చి 17: ఎన్నికల బాండ్ల పేరుతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 'వైట్ కాలర్' అవినీతికి పాల్పడిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు. ముంబై శివాజీ పార్కులో ఆదివారం జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ గత పదేండ్లలో విదేశీ పర్యటనలకు వెళ్లడం, అబద్ధాలను ప్రచారం చేయడమే మోదీ పనిగా పెట్టుకున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల బాండ్లతో బీజేపీ అవినీతి కూడా బయటపడిందని అన్నారు. బీజేపీ కన్నా దేశానికి మరో ప్రమాదమేమీ లేదని అన్నారు. ఈ సభలో జమ్ము-కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ప్రసంగించారు.

## క్యాటరాక్ట్‌కు సరైన మందు.. పసుపు, అల్లం

### ఆయుర్వేద దినుసులకు కంటి శుక్లాల సమస్యను తగ్గించే శక్తి

భారత జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్ : మధుమేహ వ్యాధిగ్రస్థుల్లో కంటి శుక్లాల పరిపక్వతను తగ్గించే శక్తి భారతీయ సంప్రదాయ ఆహారం, ఆయుర్వేద మందుల్లోనే ఉంది. పసుపు, ఉసిరి, మిరియాలు, దాల్చిన చెక్క, మెంతులు, అల్లం మిశ్రమంతోపాటు మొక్కల ఆధారిత ఆహారాన్ని వినియోగించడం వల్ల కంటి శుక్లాల పరిపక్వత తీవ్ర స్థాయికి చేరే వేగాన్ని తగ్గించే అవకాశం ఉంది. జాతీయ పోషకాహార సంస్థ శాస్త్రవేత్తల పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. మధుమేహ రోగులు మొక్కల ఆధారిత దినుసులను వినియోగించడం వల్ల కేటరాక్ట్‌తో పాటు అనేక ఇతర అస్వస్థతలను కూడా నిరోధించవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. పైన పేర్కొన్న ఆరు దినుసులను తినడం వల్ల డయాబెటిక్ కేటరాక్ట్‌లను నిరోధించవచ్చునని, కేటరాక్ట్ మెచ్యురేషన్ వేగాన్ని తగ్గించవచ్చునని తేలింది. ఇతర వ్యాధులతో బాధపడేవారితో పోల్చుకుంటే, మధుమేహ వ్యాధిగ్రస్థులకు కేటరాక్ట్ వచ్చే అవకాశాలు మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటాయి. వీరి కంటిలో శుక్లం ఏర్పడిన తర్వాత వృద్ధి చెందే అవకాశాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. డయబెటిస్ లేని వారితో పోల్చుకున్నపుడు, మధుమేహ వ్యాధిగ్రస్థులకు కేటరాక్ట్ సర్జరీ చేస్తే, డయాబెటిక్ రెటినోపతీ వేగంగా వృద్ధి చెందుతుందని, అంతిమంగా దృష్టిని కోల్పోవడానికి దారి తీస్తుందని అధ్యయనాలు చెప్తున్నట్టు పరిశోధకులు తెలిపారు.